క్లుప్తంగా

మంత్రి హరీష్‌రావుకు వినతి

నాగార్జునసాగర్: తెలంగాణ ప్రభుత్వం బీసీ వర్గాలలోని కుల, చేతివృత్తిదారులకు ముడిసరకు, పనిముట్లు కొనుగోలు చేసుకునేందుకు రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని నిర్ణయించింది. ఈ పథకంలో ఆరె కటిక కులస్తులను చేర్చాలని ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావుకు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ ఆరె కటిక సంఘం అధ్యక్షుడు, నందికొండ మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్ హీరేకార్ రమేష్‌జీ తదితరులు పాల్గొన్నారు.

చందంపేట ఎస్‌ఐ క్రాంతి బాధ్యతల స్వీకరణ


క్రాంతికుమార్

చందంపేట: మండల నూతన ఎస్‌ఐగా రుద్ర క్రాంతి కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సూర్యాపేట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండల ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత


కనకదుర్గ ఆలయంలో పూజల్లో పాల్గొన్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి

మాడుగులపల్లి: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ ఫ్లోర్ లీడర్, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండలంలోని గురప్పగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన డిగ్రీ మిత్రులతో కలిసి ఆలయానికి హుండీని బహూకరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కర్ర ఇంద్రారెడ్డి, డాక్టర్ విక్రమ్‌రెడ్డి, రమేష్, రఘునందన్, కోమటిరెడ్డి, రాజేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అన్నప్రాసన


చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ కల్పన

మాడుగులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు సామూహిక అన్నపాసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గడ్డమీది సైదులు సైతం తన కుమారుడు సాధ్విక్‌కు అంగన్‌వాడీ కేంద్రంలోనే అన్నప్రాసన జరిపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కల్పన, ఆయా నవ్య, వెంకన్న, జగన్, రంగారావు, సైదులు, మంగమ్మ, నర్మద, స్వరూప, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంబురాలను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే తెలంగాణ సంక్షేమ సంబురాలను జయప్రదం చేయాలని ఆర్డీఓ చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

బీమా సొమ్ము అందజేత


లిఖితకు బీమా చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ మురళీకృష్ణ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ మండలంలోని నిలాయిగూడెం గ్రామానికి చెందిన దుడుకు రమణ తన పేరుమీద ఎస్‌బీఐలో లైఫ్ ఇన్సూరెన్స్ చేయించింది. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతిచెందగా ఆమె పేరు మీద ఉన్న రూ.2లక్షల బీమా సొమ్మును బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ మృతురాలి కుమార్తె లిఖితకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. లిఖిత తండ్రి అంతకు ముందే మరణించగా ఇన్సూరెన్స్ అందిందని, ఇప్పుడు ఆమె తల్లి మరణంతోనూ వచ్చిన ఇన్సూరెన్స్ డబ్బులు ఆ కుటుంబానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో లిఖిత మేనమామ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన చెరువులు

- నాలుగేళ్ల క్రితం తెగిన వెంగన్నగూడెం చెరువు కట్ట
- అసంపూర్తిగా నిడమనూరు మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం
- నేడు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చెరువుల పండుగ


వెంగన్నగూడెం చెరువులో నీరు లేక పెరిగిన గడ్డి

నిడమనూరు: తెలంగాణ దవాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం గ్రామాల్లోని చెరువుల వద్ద ఊరూరా చెరువుల పండుగ పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చెరువుల వద్ద గ్రామ ప్రజలకు విందు భోజనాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం చెరువు ఉన్న ప్రతి గ్రామపంచాయతీకి ప్రభుత్వం రూ.25వేలు మంజూరు చేసింది. నిడమనూరు మండలంలోని 13 చెరువుల వద్ద ఈ కార్యక్రమం చేపట్టనున్నారు.

నాలుగేళ్లవుతున్నా మరమ్మతుల జాడేది..

దశాబ్ది ఉత్సవాల సంగతి సరే నీళ్లే లేని చెరువుల వద్ద పండుగ ఎలా నిర్వహిస్తారని పలు గ్రామాల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వెంగన్నగూడెం చెరువు కట్ట తెగి నాలుగేళ్లవుతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు దానికి మరమ్మతులు చేసిన జాడే లేదు. నాలుగేళ్లుగా చెరువు పరిధిలోని రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు చెరువులో చేపలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని మినీ ట్యాంక్‌బండ్..

నిడమనూరులో మినీ ట్యాంక్‌బండ్ మంజూరై ఏడేళ్లవుతున్నా ఇంకా పనులు పూర్తి కాలేదు. నియోజకవర్గానికి ఒక చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలనేది సీఎం కేసీఆర్ సంకల్పం. కానీ ఏడేళ్లు గడిచినా నిడమనూరు చెరువు మినీ ట్యాంక్ బండ్‌గా మారనేలేదు. మినీ టాంక్‌బండ్ పనులు పూర్తయితే నిజంగా పండుగ వాతావరణం నెలకొనేదని స్థానిక ప్రజలు అంటున్నారు.

నాలుగేళ్లు అవుతుంది



మా ఊరు చెరువు కట్ట తెగిపోయి నాలుగేండ్లు అవుతుంది. ఇప్పటి వరకు అధికారులు. ఇటువైపు కన్నెత్తి చూడలేదు. అదిగో ఇదిగో అంటున్నారే తప్ప మరమ్మతులు చేయడం లేదు. చెరువులో నీరు ఉంటే ప్రభుత్వం చెప్పినట్లు మా ఊరిలో సంతోషంగా చెరువుల పండుగ చేసుకునేవాళ్లం.

– గోనె శంకర్, రైతు, వెంగన్నగూడెం

ప్రతిపాదనలు పంపించాం



వెంగన్నగూడెం గ్రామ చెరువు మరమ్మతులకు సంబంధించి గతంలోనే ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరైతే మరమ్మతు పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం. నిడమనూరు మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి సంబంధించి మెటల్ రోడ్డు, పార్క్, లైటింగ్, బోటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు రూ.4కోట్ల పనులు పూర్తయ్యాయి.

– శ్రీనివాస్, డీఈ, నిడమనూరు డివిజన్

కేసీఆర్‌తోనే బీడు భూములు సస్యశ్యామలం

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా: తెలంగాణలో సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి బీడు భూములను సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం హాలియాలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సాగునీటి దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి, కాళేశ్వరం ప్రాజెక్టును అతి తక్కువ కాలంలోనే నిర్మించారని అన్నారు. జానారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చేసిందేమీలేదని విమర్శించారు. తలాపున కృష్ణమ్మ పరిగెడుతున్నా కృష్ణపట్టె ప్రాంతంలో 50ఏళ్లుగా బీడు భూములకు సాగునీరు అందించలేని అసమర్థుడు జానారెడ్డి అని అన్నారు. నెల్లికల్లు లిఫ్ట్ నిర్మాణం చేపట్టడంలో జానారెడ్డి పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. 1997లో అప్పటి ఎమ్మెల్యే రామ్మూర్తియాదవ్ చొరవతో వరద కాలువ నిర్మాణం ప్రారంభం కాగా, ఆ తర్వాత జానారెడ్డి వరద కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయించలేకపోయారన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య చొరవ, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారం, మంత్రి హరీష్‌రావు తోడ్పాటుతో వరద కాలువ పూర్తి చేసిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదేనన్నారు. జానారెడ్డి హయాంలో కాంట్రాక్టర్ల మేలు కోసం, వాళ్లు ఇచ్చే కమిషన్ల కోసమే అస్తవ్యస్తంగా కాలువల నిర్మాణం చేపట్టారని విమర్శించారు. డీ–8, డీ–9 కాలువల చివరి భూములకు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాటలు నమ్మి వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలకు ఓటేస్తే రాష్ట్ర అభివృద్ధి కుంటుబడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, ఎడమ కాల్వ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి, ఈఈ కరుణాకర్, డీఈలు సీతారాం, కేశవ్, వేణు, వెంకటేశ్, ఏఈఈలు వేణుగోపాల్, నరేష్, అయేషా, రవి, శ్రవణ్, జగపతి, ప్రవీణ్, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: తెలంగాణ ప్రభుత్వం సాగు, తాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని సాయి రమ్య ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాగునీటి దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలో 1.80లక్షల ఎకరాలకు సాగు నీరు అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని సింగరాజుపల్లి, గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు పేర్కొన్నారు. ఐదు లిఫ్టుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.585 కోట్లను మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్నిరంగాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, ఎంపీపీలు మాధవరం సునీతాజనార్దన్‌రావు, వంగాల ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీలు మారుపాకుల అరుణాసురేష్‌గౌడ్, కేతావత్ బాలునాయక్, నాయకులు వల్లపురెడ్డి, ముక్కమల బాలయ్య, కేసాని లింగారెడ్డి, ఆరెకంటి రాములు, అర్వపల్లి నర్సింహ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను సామరస్యంగా నిర్వహించుకోవాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

త్రిపురారం: గ్రామాల్లో క్రీడా పోటీలను సామరస్యంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సూచించారు. త్రిపురారం మండలంలోని బెజ్జికల్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్, బెజ్జికల్ సర్పంచ్ గజ్జెల కోటిరెడ్డి, బండారు ప్రసాద్, ఇండ్ల జానకిరాములు, కిలారి సైదులు, బాల్లి రేణుక వెంకట్, ఇంజం రాంరెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


బెజ్జికల్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

అపర భగీరథుడు సీఎం కేసీఆర్

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి సీఎం కేసీఆర్ అపర భగీరథుడిగా నిలిచారని మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 117చెరువుల మరమ్మతులకు చేపట్టినట్లు తెలిపారు. నీటిపారుదల శాఖను పునఃవ్యవస్థీకరించి జిల్లా పరిధిలో ఒక చీఫ్ ఇంజనీర్ ఆఫీసుతో పాటు మూడు సర్కిళ్లు, 12 డివిజన్‌లు, 46 సబ్ డివిజన్లు ఏర్పాటు చేసి నీటి వనరులపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశారన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని యాద్గార్‌పల్లి పందిర్లపల్లి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేసేందుకు రూ.9.72కోట్లతో కేటాయించామన్నారు. కేశవాపురం, కొండ్రపోల్, దామరచర్లలో 5875 ఎకరాలకు నీరందించేందుకుగాను మూసీ నదిపై రూ.75.93కోట్లతో లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రారంభించామన్నారు. బొత్తలపాలెం, వాడపల్లి లిఫ్టుల కోసం రూ.229.25కోట్లు, అడవిదేవులపల్లి మండలంలోని బాల్నెపల్లి, దున్నపోతులగండి లిఫ్టులకు రూ.219.90కోట్లు, వేములపల్లి, వీర్లపాలెం గ్రామాల్లో లిఫ్టులకు రూ.42కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, ఆర్డీఓ చెన్నయ్య, రైతు సంఘం జిల్లా నాయకుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, నాగార్జునచారి, చిట్టిబాబనాయక్, ఎండీ యూసుఫ్, ఈఈ లక్ష్మణ్‌నాయక్, డీఈ బుచ్చిబాబు, ఐబీ డీఈ జనార్దన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

వేములపల్లి: ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గన్‌మెన్ నిరుడు నర్సయ్య తల్లి ప్రమీల బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేములపల్లి మండలంలోని మంగాపురం గ్రామానికి వెళ్లి ప్రమీల మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచులు సాయిని సైదులు, అంకెపాక రాజు, ఎంపీటీసీ గడ్డం రాములమ్మవెంకన్న, నాయకులు అంకెపాక సైదులు, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

బీసీలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర


జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రంలోని బీసీలకు బీసీ బంధు అమలు చేయకుండా బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం చేస్తామంటూ సీఎం కేసీఆర్ మరోసారి బీసీలను మోసం చేసేందుకు కుట్ర పన్నారని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్నాల వెంకన్నయాదవ్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలు అధికశాతం ఉన్నారని, దళిత బంధు మాదిరిగా బీసీ బంధు అమలు చేయడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. బీసీలకు బీసీ బంధు పథకాన్ని అమలు చేసి రూ.10లక్షల సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఆర్లపూడి శ్రీను, గంగాధర్, ఇంద్రాచారి, విజయ, అనిల్, వెంకటేశ్, అజయ్ తదితరులున్నారు.

బీసీల ఓట్ల కోసమే..

బీసీల ఓట్ల కోసమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పాగుల సైదులుగౌడ్ ఆరోపించారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కూడా సీఎం కేసీఆర్ బీసీలను అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ జిమ్మిక్కులను బీసీలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వేముల రామకృష్ణ, మండల అధ్యక్షుడు కొండ జోష్‌గౌడ్, సంతోష్ ఉన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ


కల్లు గీత కార్మికుని కుటుంబానికి రూ.25వేల చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్

చింతపల్లి: తెలంగాణ ప్రభుత్వం కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ తెలిపారు. చింతపల్లి మండల పరిధిలోని మదనాపురం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు ముద్దం వెంకటయ్య తాటిచెట్టు పైనుంచి జారిపడి రెండు నెలల క్రితం మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి కల్లు గీత కార్పొరేషన్ నుంచి బుధవారం రూ.25వేల చెక్కును ఆర్థికసాయంగా ఆయన అందజేసి మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కల్లు గీత కార్మికులు ప్రమాదాలబారిన పడకుండా ప్రతిఒక్కరికి సేఫ్టీ మోపులను అందజేస్తామన్నారు. ప్రమాదాలకు గురై మృతిచెందిన గీత కార్మికులను ఆదుకునేందుకు గీతన్న బీమా ద్వారా ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థికసాయం అందించేందుకు కార్యచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పులిరాజుగౌడ్, అక్రంయాదవ్, రవిందర్‌గౌడ్, జంగయ్యగౌడ్, కుంభం శ్వేతాశ్రీశైలం, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపాలెంలో 'బడిబాట'


బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

వేములపల్లి: మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్య, అంగన్‌వాడీ టీచర్లు సుభద్ర, యాదమ్మ, రూప, సోమమ్మ, ధనమ్మ, భవాని, నాగమణి, స్వర్ణలత, యలమంద, మట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దోనియాల గ్రామస్తులు

కొండమల్లేపల్లి: మండలంలోని దోనియాల గ్రామ పంచాయతీ పరిధి సర్వే నంబర్ 33లో గల 4.39 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను తొలగించాలని దోనియాల గ్రామస్తులు పలువురు బుధవారం కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన తహసీల్దార్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతానికి ఆర్‌ఐ, రెవెన్యూ సిబ్బందిని పంపించి వాటిని తొలగించినట్లు గ్రామస్తులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వరికుప్పల వెంకటయ్య, దాసరి యాదగిరి, తాళ్ల సురేష్, ఎలిమినేటి రాములు, బోడ నాగార్జున, గునమోని మల్లేశ్, దాసరి సైదులు తదితరులున్నారు.

సాగర్‌లో మత్స్యకారుల సంబురాలు

నాగార్జునసాగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా మత్స్యశాఖ ఆదేశానుసారం నాగార్జునసాగర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సాగర్ పట్టణంలో మత్స్యకారులు చేపలు వండుకొని సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం చెరువుల్లో పూడికతీసి, కొత్త కొత్త రిజర్వాయర్‌లను నిర్మించడమే కాకుండా అందులో చేప పిల్లలను వదిలి తమకు ఉపాధి కల్పిస్తుండడంతో సంబరాలు జరుపుకున్నట్లు మత్స్యకారులు తెలిపారు. కార్యక్రమంలో రాజారావు, ముసలయ్య, బంగారి, అప్పలరాజు, యేసు, శ్రీను, రంగ, గురువయ్య, చిట్టిబాబు, నూకరాజు, శుభానంద్ తదితరులు పాల్గొన్నారు.


సంబురాలు చేసుకుంటున్న మత్స్యకారులు

చెరువుల పండుగను విజయవంతం చేయాలి


గుర్రంపోడు: చేపూరు గ్రామంలోని చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

అడవిదేవులపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం గ్రామపంచాయతీలు, నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, జెడ్పీటీసీ కుర్ర సేవ్యానాయక్ అన్నారు. బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అడవిదేవులపల్లిలోని భాస్కర్‌రావు చెరువు, జిలకరకుంట చెరువు, బంగారుకుంటతండా చెరువు, మల్లప్ప చెరువుల వద్ద సాయంత్రం 4గంటల నుంచి నిర్వహించనున్న చెరువుల పండుగను విజయవంతం చేసేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పెద్దవూరలో..

పెద్దవూర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించనున్న చెరువుల పండుగను విజయవంతం చేయాలని మత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు నాగయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి పానుగోతు దాకునాయక్‌తో కలిసి మత్స్యకారుల సంఘం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు అన్ని చెరువుల వద్ద వన భోజనాలు ఉంటాయని, ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో అంజి, నడ్డి లక్ష్మయ్య, పున్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, నందికొండ శ్రీధర్‌రెడ్డి, భార్గవరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గుర్రంపోడులో ఏర్పాట్లు పూర్తి

గుర్రంపోడు: మండలంలోని 37 గ్రామపంచాయతీల్లోని చెరువుల వద్ద గురువారం చెరువుల పండుగ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 37 మంది అధికారులను చెరువుల ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు నీటిపారుదల శాఖకు చెందిన ఐదుగురు అధికారులను ఎనిమిది చెరువులకు ఒకరు చొప్పున క్లస్టర్ ఇన్‌చార్జిలుగా నియమించారు. వీరు బుధవారం ఆయా గ్రామాల్లోని చెరువల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు కట్టల వద్ద ఏర్పాటు చేసిన వేదికపై అధికారులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన చెరువుల అభివృద్ధి, పెరిగిన ఆయకట్టు, భూగర్భజలాలలు తదితర విషయాలను రైతులకు వివరిస్తారు. అనంతరం సాయంత్రం చెరువు కట్టపై రైతులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తారు. చెరువుల పండుగకు మత్స్య సొసైటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాసరావు కోరారు.

'చలో వలిగొండ' కరపత్రం విడుదల


కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు

మిర్యాలగూడ టౌన్: ఎస్సీ వర్గీకరణ సాధనకై ఈ నెల 11న యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో నిర్వహించనున్న ఉమ్మడి నల్లగొండ మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు చలో వలిగొండ కరపత్రాన్ని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జి కందుకూరి సోమన్న, మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మచ్చ ఏడుకొండలు మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా ఎస్సీ వర్గీకరణను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని వాపోయారు. ఎస్సీ వర్గీకరణపై తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మడుపు శ్రీనివాస్ మాదిగ, దైద రవి మాదిగ, నూకపంగు మోహన్, దైద సురేష్, సూరన్న, నాగరాజు తదితరులున్నారు.

మహిళా సంక్షేమ దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణవేణి


కుట్టు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణవేణి

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13న మిర్యాలగూడ పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న మహిళా సంక్షేమ దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నల్లగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణవేణి అన్నారు. బుధవారం పట్టణంలోని హౌజింగ్ బోర్డులో గల మిర్యాలగూడ అర్బన్, దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టులను ఆమె తనిఖీ చేసి రికార్డులతో పాటు కిశోర బాలికలకు 45 రోజులుగా వివిధ కోర్సులపై నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అంతకుముందుగా శ్రీమన్నారాయణ ఫంక్షన్ హాల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంక్షేమ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు కృషిచేయాలన్నారు. కిశోర బాలికలు వివిధ కోర్సులను నేర్చుకోవడం వలన ఉపాధి పొందవచ్చన్నారు. ఆమె వెంట మిర్యాలగూడ అర్బన్, దామరచర్ల ప్రాజెక్టుల సీడీపీఓలు మమత, చంద్రకళ, సూపర్‌వైజర్లు రేవతి, రాధిక, పద్మ, నజిమా, సుశీల, మాధవి, లీలాకుమార్ తదితరులున్నారు.

తుల శ్రీనివాస్‌కు వెన్నెల సాహితీ పురస్కారం

రామగిరి(నల్లగొండ): జిల్లాకు చెందిన ప్రముఖ కవి తుల శ్రీనివాస్‌కు 2022 సంవత్సరానికి గాను జాతీయ స్థాయి వెన్నెల సాహితీ పురస్కారం లభించింది. శ్రీనివాస్ రచించిన వచన కవితా సంపుటి చింతల తొవ్వను సిద్దిపేట జిల్లాకు చెందిన వెన్నెల సాహితీ సంఘం వారు పురస్కారానికి ఎంపిక చేశారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్, డాక్టర్ ఉదారి నారాయణ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. త్వరలో సిద్దిపేటలో జరిగే అవార్డు ప్రదానోత్సవంలో పురస్కారం అందజేయనున్నారని శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్‌ను జిల్లాకు చెందిన కవులు మునాసు వెంకట్, పెరుమాళ్ళ ఆనంద్, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్ అభినందించారు.